STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 123 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 17 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

ఓట్ చోర్.. గద్దీ ఛోడ్



- భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!
- ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్
- జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి
- రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు

వివరాలు 4లో..

భారత్ సరికొత్త మార్గం చూపింది!



- భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు
- స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు

4

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు

4





పదేళ్లలో దేశంలోనే..

అగ్రస్థానంలో ఏపీ!

చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ గాడిలో పడిన రాష్ట్రం

రాబోయే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానానికి చేరుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. గతంలో రెవెన్యూ లోటుతో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనదైన విజన్‌తో మళ్లీ గాడిలో పెట్టారని, రాష్ట్రానికి వస్తున్న భారీ పెట్టుబడులే ఇందుకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. మరోవైపు, ప్రజాస్వామ్య విలువల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన అక్షర యోధుడు రామోజీరావు జయంతిని ఇకపై రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

వివరాలు 2లో..

- ఏపీకి వస్తున్న పెట్టుబడులే ప్రగతికి అసలైన నిదర్శనం
- గూగుల్ భారీ పెట్టుబడి దేశానికే ఎంతో గర్వకారణం
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అమిత్ షా
- ప్రతికూల పరిస్థితులెదురైనా తలవంచని యోధుడు రామోజీ
- ఇక నుంచి రాష్ట్ర పండుగగా రామోజీరావు జయంతి
- తెలుగు జాతి కీర్తి, ఆస్తి ఆయనన్న సీఎం చంద్రబాబు

ఏపీకి తుపాను గండం!

- శుక్రవారం తీరం దాటనున్న అతి తీవ్ర తుపాను
- నెల్లూరు-తుని మధ్య వణికిస్తున్న వాతావరణం
- నేడు తుపానుగా మారనున్న వాయుగుండం
- తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో గాలులు
- అప్రమత్తంగా ఉండాలన్న ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్



కోస్తాంధ్రకు పొంచి ఉన్న అతి తీవ్ర తుపాను గండంతో అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం శరవేగంగా బలపడుతూ ఏపీ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న రెండు రోజుల్లో మరింత తీవ్ర రూపం దాల్చి.. ఈ నెల 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరు-తుని మధ్య 'అతి తీవ్ర తుపాను'గా తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. దీని ముప్పుతో గురు, శుక్రవారాల్లో తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో భయానక ఈదురుగాలులు వీయడంతో పాటు, కోస్తా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని, రైతులు, తీర ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

వివరాలు 2లో..

పంచాయతీ ఎన్నికల.. రెండో దశ సై!

- ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన పునేఠ
- ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్లు
- 24న బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా
- 29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- రెండో దశలో విశాఖ జిల్లాకు మినహాయింపు



3

జగన్‌ది కపట ప్రేమ

- ఆక్వా రైతుల పేరుతో వైసీపీ రాజకీయాలు
- రాయితీలు దాచిపెట్టి సాక్షి పత్రిక అసత్య కథనాలు
- తీవ్రంగా మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు
- తుపాను ముప్పుపై అధికారులకు కీలక ఆదేశాలు
- పంటల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- సముద్రంలో ఉన్న 173 బోట్లను వెనక్కి రప్పించాలి

2

తుఫాను ముప్పు.. సీఎం హైఅలర్ట్!



- ఈ నెల 20న కోస్తాంధ్రకు తీవ్ర తుఫాను హెచ్చరిక
- ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పరిస్థితిని సమీక్షించిన చంద్రబాబు
- ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

2

బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారి ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో శనివారం ఆయన సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు.



వసతి గృహాల్లో.. స్పెషల్ హెల్త్ డ్రైవ్!

2.65 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారుల నివేదిక

3

కుంకీ ఏనుగుల శిబిరానికి.. అపూర్వ స్పందన!

పర్యాటకులతో కళకళలాడుతున్న పలమనేరు అటవీ ప్రాంతం

3



బల్దియా పోరుకు.. వైఎస్సార్సీపీ సై!

- మేయర్లు, చైర్మన్ల అభ్యర్థుల జాబితా విడుదల
- సామాజిక సమీకరణాల ఆధారంగా పేర్ల ఖరారు
- శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా గుండా లక్ష్మీదేవి
- మంగళగిరి-తాడేపల్లి బరిలో పున్నా నాయక్
- ప్రచారాన్ని ముమ్మరం చేయాలని అధిష్టానం పిలుపు



3

ఆక్వాన్ గండం.. విద్యుత్ శాఖ అలర్ట్!

- తుపాను ముప్పుపై అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు
- ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష
- స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలి
- ప్రాణనష్టం జరగకుండా భద్రతా చర్యలు

2





తుపాను ముప్పు.. సీఎం హైఅలర్ట్!

ఈ నెల 20న కోస్తాంధ్రకు తీవ్ర తుపాను హెచ్చరిక

ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పరిస్థితిని సమీక్షించిన చంద్రబాబు

ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం తుఫానుగా మారి ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో శనివారం ఆయన సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని, కేంద్ర బృందం చేసిన సిఫార్సులను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని నిర్దేశించారు. గతంలో వచ్చిన ఆర్నబ్ తుఫాను తరహాలోనే ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తా తీరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు సీఎంకు వివరించారు.

వరదను రిజర్వాయర్లకు మళ్లించండి..

రానున్న తుఫాను ప్రధానంగా కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని సీఎం సమీక్షలో వెల్లడైంది. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లను ఆయన అప్రమత్తం చేశారు. ముందుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఆయా జిల్లాలకు పంపాలని ఆదేశించారు. తుఫాను సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని, సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, భారీ వర్షాల వల్ల వచ్చే వరద ప్రవాహాలను వృథాగా పోనివ్వకుండా, కచ్చితంగా రిజర్వాయర్లకు మళ్లించేలా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఏపీకి తుపాను గండం!

శుక్రవారం తీరం దాటనున్న అతి తీవ్ర తుపాను

నెల్లూరు-తుని మధ్య వణికిస్తున్న వాతావరణం

నేడు తుపానుగా మారనున్న వాయుగుండం

తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో గాలులు

అప్రమత్తంగా ఉండాలన్న ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్

అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం క్రమంగా బలపడి తుపానుగా మారనుంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ నవంబర్ 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరుఉతుని మధ్య 'అతి తీవ్ర తుపాను'గా తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం గత ఆరు గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం ఇది చెన్నైకి 700, విశాఖకు 800, గోపాల్‌పూర్‌కు 910 కిలోమీటర్ల దూరంలో ఉంది. సోమవారం సాయంత్రానికి ఇది తుపానుగా మారి.. మంగళవారానికి తీవ్ర తుపానుగా బలపడే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

అతి భారీ వర్షాలు.. గాలుల తీవ్రత..

ఈ తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలో గురు, శుక్రవారాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్నారు. సోమవారం సాయంత్రం నుంచే కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వెల్లడించారు. తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు. రైతులు, తీర ప్రాంత ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఆక్వాన్ గండం.. విద్యుత్ శాఖ అలర్ట్!

తుపాను ముప్పుపై అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశాలు

అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): ఆక్వాన్ తుపాను ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో కీలక దిశానిర్దేశం చేశారు. గత తుపాన్ల సమయంలో విద్యుత్ పునరుద్ధరణలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాను తీవ్రతకు ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేలకూలినా, తీగలు తెగిపడినా వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు తరలించి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. తుపాను సమయంలో ప్రాణనష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని, ముఖ్యంగా తెగిపడిన తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే పరిస్థితులు ఉంటే వినియోగదారులకు ముందుగానే సమాచారం అందించాలని ఆదేశించారు. కరెంటు సరఫరా నిలిచిన ప్రాంతాలు, పునరుద్ధరణకు పట్టే సమయం తదితర వివరాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ.. విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు.

పదేళ్లలో దేశంలోనే.. అగ్రస్థానంలో ఏపీ!

- చంద్రబాబు నాయకత్వంలో మళ్లీ గాడిలో పడిన రాష్ట్రం
- ఏపీకి వస్తున్న పెట్టుబడులే ప్రగతికి అసలైన నిదర్శనం
- గూగుల్ భారీ పెట్టుబడి దేశానికే ఎంతో గర్వకారణం
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అమిత్ షా
- ప్రతికూల పరిస్థితులెదురైనా తలవంచని యోధుడు రామోజీ
- ఇక నుంచి రాష్ట్ర పండుగగా రామోజీరావు జయంతి:సీఎం

విజయవాడ, నవంబర్ 16 (సమయం న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మళ్లీ గాడిలో పడిందని, రాబోయే పదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానానికి చేరుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ కష్టకాలంలో రాష్ట్రాన్ని అద్భుతమైన ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఆయన ప్రశంసించారు. పద్మవిభూషణ్ రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక వేదికపై అమిత్ షా మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి, పెట్టుబడులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందా అని తొలుత భావించినా, చంద్రబాబు తనదైన విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధి గణాంకాలను తాను నిశితంగా పరిశీలిస్తుంటానని, ఏపీ ఎదుగుదల ఎంతో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ ఏకంగా 15 బిలియన్ డాలర్ల



పెట్టుబడి పెట్టడం రాష్ట్రానికే కాకుండా దేశానికే గర్వకారణమన్నారు. అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేయనున్న తొలి డేటా సెంటర్ ప్రాజెక్టు దేశ డిజిటల్ రంగానికి అత్యంత కీలకమవుతుందని వివరించారు.

ఆ ప్రాజెక్టులు ఎంతో కీలకం..

విశాఖ తీరంలో సముద్రగర్భం నుంచి ఏర్పాటు చేస్తున్న సబ్‌సీ కేబుల్ ప్రాజెక్టు ఎంతో ప్రాధాన్యమైనదని అమిత్ షా అన్నారు. రాష్ట్రానికి తొలి సెమీకండక్టర్ యూనిట్, స్టీల్ ఫ్యాక్టరీలు, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం లాంటి భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని వివరించారు. గత రెండున్నరేళ్లలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రానికి రూ.30 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు తీసుకురావడం గొప్ప విషయమని ప్రశంసించారు. గతంలో కొందరి తప్పులతో నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరించి, రైతులకు నీరందించేందుకు సీఎం తీవ్రంగా కృషి చేస్తున్నారని అమిత్ షా చెప్పారు. ఇక రామోజీరావు సేవలను స్మరించుకుంటూ.. కొందరు వ్యక్తులు తమ కృషితో వ్యవస్థలుగా మారిపోతారని, వారి సేవలు దేశానికే స్ఫూర్తిగా నిలుస్తాయని హోంమంత్రి అన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తుల్లో ఒకరైన రామోజీరావును రామ్‌నాథ్ గోయెంకా లాంటి విశిష్ట పాత్రికేయులతోనే పోల్చగలమన్నారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా పత్రికను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిపారని ప్రశంసించారు.

రాష్ట్ర పండుగగా రామోజీ జయంతి : సీఎం బాబు

విలువల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు రామోజీరావు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఆయన తెలుగు జాతి కీర్తి, తరతరాలకు స్ఫూర్తి అని అభివర్ణించారు. రామోజీరావు జయంతిని ఇకపై రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఏటా ఈ వేడుకలు అధికారికంగా జరిగేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఎం ప్రకటించారు. కృష్ణా జిల్లాలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన తన సంకల్పం, క్రమశిక్షణ, విశ్వసనీయతతో అద్భుతమైన సంస్థలను స్థాపించి సమర్థంగా నడిపించారని వివరించారు. ప్రజా సమస్యలపై పోరాడటంతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో ఈనాడు సంస్థ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి అనే పేరును ఆయనే సూచించారని, రాజధాని నిర్మాణానికి రూ.10 కోట్లు, కరోనా విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రానికి మరో రూ.10 కోట్లు విరాళంగా అందించారని సీఎం గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు, ఒత్తిళ్లు ఎదురైనా ఆయన ఎవరికీ తలవంచలేదన్నారు. విచారణల పేరుతో ఇబ్బందులకు గురిచేసినా, అనారోగ్యంతో ఉన్న వీడియోలను బయటపెట్టి అవమానించే ప్రయత్నాలు చేసినా ఆయన తన పోరాట పంథాను వీడలేదని సీఎం పేర్కొన్నారు.

తొమ్మిది మందికి ఎక్సలెన్స్ అవార్డులు

తొమ్మిది విభిన్న రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఈ వేదికపై రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. జర్నలిజం, కళలు-సంస్కృతి, గ్రామీణాభివృద్ధి-వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్-టెక్నాలజీ, యూత్ ఐకాన్, సామాజిక సేవ, విద్య, వైద్య రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అమిత్ షా, చంద్రబాబు, పవన్ కల్యాణ్, అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేశారు. రామోజీరావు పేరుతో పురస్కారం అందుకోవడం అవార్డు గ్రహీతల జీవితాల్లో విలువైన ఘట్టంగా నిలిచిపోతుందని నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు, రామోజీ గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌ది కపట ప్రేమ..

- ఆక్వా రైతుల పేరుతో వైసీపీ రాజకీయాలు
- రాయితీలు దాచిపెట్టి సాక్షి అసత్య కథనాలు
- తీవ్రంగా మండిపడ్డ మంత్రి అచ్చెన్నాయుడు
- తుపాను ముప్పుపై అధికారులకు ఆదేశాలు
- పంటల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- సముద్రంలో ఉన్న 173 బోట్లను వెనక్కి రప్పించాలి

అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): ఆక్వా రైతుల పేరుతో కపట ప్రేమ ఒలకబోస్తూ అసత్య ప్రచారం చేస్తున్న వైఎస్ జగన్‌పై రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల రాయితీలు ఇస్తుంటే రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు రాయించడం సిగ్గుచేటని విమర్శించారు. మరోవైపు ముంచుకొస్తున్న తుపాను ముప్పు నుంచి రైతులు, మత్స్యకారులను కాపాడేందుకు అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన వ్యవసాయ, మత్స్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు.

రూ.1.50కే కరెంటు ఇస్తుంటే చూడలేరా?

గత ప్రభుత్వ హయాంలో 100 కౌంట్ రొయ్యల ధర కిలో రూ.200 ఉండగా.. ఇప్పుడు రూ.280కి చేరిన విషయం జగన్‌కు కనిపించడం లేదా అని మంత్రి నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా 75 వేల ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు ఏకంగా రూ.1300 కోట్ల మేర రాయితీ కల్పిస్తూ యూనిట్ కరెంటును రూ.1.50కే ఇస్తున్న వాస్తవాన్ని సాక్షి పత్రిక ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతోందని ప్రశ్నించారు. తుపానుల వల్ల నష్టపోయిన ఆక్వా రైతులకు పరిహారం కోసం రూ.3.96 కోట్ల అంచనాతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులతో ధరల్లో హెచ్చుతగ్గులు వస్తుంటే రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం జగన్ దివాలాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. రైతుల కష్టాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పంటల రక్షణ.. మత్స్యకారుల భద్రత..

ముంచుకొస్తున్న తుపాను ముప్పు నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో 23.87 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు ఉండగా, కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి తదితర పంటలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతులకు



సూచించారు. 16 జిల్లాల్లోని 2.69 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని, పొలాల్లో నీరు నిలవకుండా కాలువలు శుభ్రం చేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గే వరకు పురుగుమందుల పిచికారీ నిలిపివేయాలని చెప్పారు. సముద్రంలో వేటకు వెళ్లిన 30,808 బోట్లలో ఇప్పటికే 30,635 బోట్లు సురక్షితంగా తీరానికి చేరాయన్నారు. ఇంకా సముద్రంలో ఉన్న 173 బోట్లను నాభిమిత్ర వ్యవస్థ ద్వారా ట్రాక్ చేస్తూ వెనక్కి రప్పిస్తున్నామని తెలిపారు. మత్స్యకారులకు ఇప్పటికే లక్షకు పైగా వాయిస్ హెచ్చరికలు పంపామని, ప్రాణనష్టం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

శబరిమల యాత్రకు విస్తృతమైన ఏర్పాట్లు

- ఏపీ సీఎస్‌కు దేవస్వం బోర్డు చైర్మన్ లేఖ
- ఉచితంగా మరుగుదొడ్ల వినియోగం
- పంపా నదిలో పాత దుస్తులు వదలొద్దు
- భక్తులకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి

అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): ప్రతి ఏటా అత్యంత వైభవంగా జరిగే శబరిమల యాత్రకు ఈసారి కూడా విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు చైర్మన్ కె.జయకుమార్ తెలిపారు. 'పరిశుభ్రమైన శబరిమల.. పవిత్రమైన శబరిమల' అనే ప్రధాన నినాదంతో ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్‌కు ఆయన లేఖ రాశారు. ఏపీ నుంచి ఏటా లక్షలాది మంది భక్తులు శబరిమలను దర్శించుకుంటారని గుర్తు చేశారు. రానున్న రెండు నెలల పండుగ సీజన్‌లో అయ్యప్ప స్వాములకు సంతృప్తికరమైన యాత్రా అనుభూతిని పంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. గత లోపాలను సరిదిద్ది పారిశుద్ధ్య నిర్వహణలో కీలక మార్పులు తీసుకొచ్చామని లేఖలో పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా మరుగుదొడ్లను ఉచితంగా అందుబాటులోకి తెచ్చామని, వాటి నిర్వహణను ఒక ప్రొఫెషనల్ ఏజెన్సీకి అప్పగించినట్లు స్పష్టం చేశారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా తగినంత అరవణ ప్రసాదం అందుబాటులో ఉంచుతామని వివరించారు.

నదిలో దుస్తులు వదలొద్దు..

పంపా నది వద్ద భక్తులు తమ పాత దుస్తులను వదిలివేయడం



ఒక సవాలుగా మారిందని జయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నదిలో దుస్తులు వదలడం ఒక ఆనవాయితీగా వస్తున్నప్పటికీ.. దానికి ఎలాంటి మతపరమైన, ఆచారపరమైన ప్రాముఖ్యత లేదని తేల్చి చెప్పారు. దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఈ అలవాటును మానుకునేలా భక్తుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ముఖ్యమైన సందేశాన్ని ప్రభుత్వ మీడియాల ద్వారా రాష్ట్రంలోని అయ్యప్ప స్వాములకు విస్తృతంగా చేరవేయాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను కోరారు. ఈ ఏడాది యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం తమకు సంపూర్ణ సహకారం అందించాలని దేవస్వం బోర్డు తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు.

బల్దియా పోరుకు.. వైఎస్సార్సీపీ సై!

- మేయర్లు, చైర్మన్ల అభ్యర్థుల జాబితా విడుదల
- సామాజిక సమీకరణాల ఆధారంగా పేర్ల ఖరారు
- శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా గుండా లక్ష్మీదేవి
- మంగళగిరి-తాడేపల్లి బరిలో పున్నా నాయక్
- ప్రచారాన్ని ముమ్మరం చేయాలని అధిష్టానం పిలుపు



అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్సీపీ మేయర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల జాబితాను అధికారికంగా విడుదల చేసింది. స్థానిక సామాజిక సమీకరణాలు, పలు రకాల అంతర్గత సమీక్షల అనంతరం పార్టీ అధిష్టానం ఈ పేర్లను ఖరారు చేసింది. జాబితా వెలువడటంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రకటించిన అభ్యర్థులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పార్టీ పిలుపునిచ్చింది. అన్ని ప్రాంతాల్లోనూ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నేతలకు దిశానిర్దేశం చేసింది.

మేయర్లు, చైర్మన్ల అభ్యర్థులు వీరే..

మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులను పరిశీలిస్తే.. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు గుండా లక్ష్మీదేవి, కాకినాడకు సత్యశ్రీ, రాజమండ్రికి దాని వెంకట్రావు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌కు పున్నా నాయక్‌ల పేర్లను అధిష్టానం ఖరారు చేసింది. ఇక మున్సిపాలిటీల చైర్మన్, చైర్‌పర్సన్ అభ్యర్థుల విషయానికొస్తే.. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు అజంతా కుమారి, రాజాంకు పద్మావతి ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి మాధవీలత, పాలకొల్లుకు ఉమా శైలజ, తాడేపల్లిగూడెం చైర్మన్‌గా జి.శ్రీనివాస్, తణుకుకు బాలకృష్ణ పోటీ చేయనున్నారు. కృష్ణా జిల్లా గుడివాడ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రవీణ పేరును పార్టీ అధికారికంగా ప్రకటించింది.

కుంకీ ఏనుగుల శిబిరానికి.. అపూర్వ స్పందన!

- పర్యాటకులతో కళకళలాడుతున్న పలమనేరు అటవీ ప్రాంతం
- రెండు నెలల్లోనే తొమ్మిది వేల మందికి పైగా సందర్శకులు
- రాష్ట్రంలోనే ప్రత్యేక పర్యాటక కేంద్రంగా ముసలమడుగు
- డిప్యూటీ సీఎం పవన్, మంత్రి దుర్గేష్ చొరవతో అభివృద్ధి
- కుటుంబ సమేతంగా గడిపేందుకు ఆహ్లాదకరమైన వేదిక



అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): ఆకాశాన్ని తాకే పచ్చని చెట్లు.. వీచే చల్లటి గాలి మధ్య రాజసంగా నడుచుకుంటూ వచ్చే గజరాజులు! ఇదంతా ఏదో దట్టమైన అటవీ ప్రాంతంలో కాదు.. చిత్తూరు జిల్లా పలమనేరులోని ముసలమడుగు కుంకీ ఏనుగుల శిబిరంలో ప్రతిరోజూ కనువిందు చేస్తున్న అద్భుత దృశ్యం. అడవి బిడ్డలైన ఏనుగులతో సాన్నిహిత్యం పెంచుకుని, వాటి జీవన శైలిని దగ్గర నుంచి చూసేందుకు ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి పోటెత్తుతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ శిబిరం కొద్ది రోజుల్లోనే పర్యాటకులతో కళకళలాడుతోంది. ఇక్కడ అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో కేవలం రెండు నెలల వ్యవధిలోనే 9,784 మంది సందర్శకులు రావడం విశేషం. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.4.5 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు.

ప్రధాన ఎకో టూరిజం హబ్‌గా..

ఏపీలో మరెక్కడా లేని విధంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ ప్రాంతం.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చొరవతో దక్షిణ భారతదేశంలోనే ప్రధాన ఎకో టూరిజం హబ్‌గా ఎదుగుతోంది. అపారమైన అటవీ సంపద, ప్రశాంత వాతావరణం పర్యాటకులకు సరికొత్త అనుభూతులను పంచుతున్నాయి. ఈ ప్రాముఖ్యతను గుర్తించిన అధికారులు దీన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టును విజయవంతంగా తీర్చిదిద్దడంలో అనంతపురం కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చిత్తూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బృందం చేసిన కృషి అభినందనీయం. వీకెండ్‌లో కుటుంబంతో కలిసి ప్రకృతి ఒడిలో, ఏనుగుల మధ్య ఆనందంగా గడిపేందుకు ముసలమడుగు శిబిరం సరైన వేదికగా పర్యాటక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వసతి గృహాల్లో.. స్పెషల్ హెల్త్ డ్రైవ్!

2.65 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

తుపానుల నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

జ్వరాలు, రక్తహీనత, ఇతర సమస్యల గుర్తింపు

4,436 మంది పిల్లలకు చర్మ వ్యాధులు

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారుల నివేదిక



అమరావతి, నవంబర్ 16 (సమయం న్యూస్): వరుస తుపానుల నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్య బృందాలు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నవంబర్ 1 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 2,148 వసతి గృహాల్లోని 2,65,556 మంది విద్యార్థులకు పీహెచ్‌సీల వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పరీక్షలు చేశారు. జ్వరాలు, రక్తహీనత, చర్మ, శ్వాసకోశ వ్యాధులను గుర్తించి అవసరమైన వారికి అక్కడికక్కడే చికిత్స అందించారు.

వ్యాధుల గుర్తింపు ఇలా..

ఈ పరీక్షల్లో 4,436 మంది పిల్లలకు చర్మ వ్యాధులు, 3,218 మందిలో రక్తహీనత ఉన్నట్లు తేలింది. 961 మందికి శ్వాసకోశ, 2,750 మందికి దంత సమస్యలు, 85 మందికి అతిసార ఉన్నట్లు గుర్తించారు. మలేరియా 14, టైఫాయిడ్ 8 కేసులు నమోదు కాగా, ఒక్క డెంగీ కేసు కూడా నమోదు కాలేదు. కాకినాడ, ఏలూరు, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో చర్మ, దంత, శ్వాసకోశ సమస్యలు అధికంగా నమోదయ్యాయి. మరోవైపు వసతి గృహాల్లో తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్యం, ఆహార భద్రతను వైద్య బృందాలు పరిశీలించాయి. 1,706 హాస్టళ్లలో పారిశుద్ధ్యం బాగుండగా, 442 చోట్ల మెరుగుపడాల్సిన అవసరం ఉందని గుర్తించాయి. మరుగుదొడ్ల నిర్వహణ 896 చోట్ల సరిగా లేదని, 14 చోట్ల అసలు అందుబాటులో లేవని మంత్రికి ఇచ్చిన నివేదికలో అధికారులు స్పష్టం చేశారు.



దుర్గమ్మకు స్వర్ణాభరణాల సమర్పణ!

కార్తీక మాసం సందర్భంగా 296 గ్రాముల బంగారం కానుక

అమ్మవారికి సమర్పించిన విజయవాడకు చెందిన దాత కుటుంబం

కాసుల పేరు, బంగారు సూత్రాలు, గొలుసులు అందజేత



విజయవాడ, నవంబర్ 16 (సమయం న్యూస్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ వారికి కార్తీక మాసం సందర్భంగా భక్తులు 296.800 గ్రాముల బంగారు ఆభరణాలను సమర్పించారు. వన్‌టౌన్‌కు చెందిన సీ.హెచ్.ఎల్.జీ.ప్రసూనాంబ, ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆలయానికి విచ్చేసి అమ్మవారికి 192.500 గ్రాముల బంగారు కాసుల పేరు, 104.300 గ్రాముల బంగారు సూత్రాలు, గొలుసులను కానుకగా అందజేశారు. దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ సమక్షంలో ఆలయ అధికారులు ఆభరణాలను స్వీకరించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రశీదులు అందజేశారు. వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతలకు అందజేశారు

పంచాయతీ ఎన్నికల.. రెండో దశ సై!

ఎస్ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన పునేఠ

ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్లు

24న బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా

29న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు

రెండో దశలో విశాఖ జిల్లాకు మినహాయింపు

విజయవాడ, నవంబర్ 16 (సమయం న్యూస్): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రెండో దశ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అయితే రెండో దశ ఎన్నికల షెడ్యూల్‌లో విశాఖపట్నం జిల్లాకు మినహాయింపు ఇచ్చారు. మూడో దశలో భాగంగా ఆ జిల్లాలోని నాలుగు మండలాలకు ఎన్నికలు నిర్వహిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 21న ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన ఉంటుంది. తిరస్కరించిన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు. 23న అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఇక 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ వెంటనే పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక కూడా జరగనుంది. అవసరమైన ప్రాంతాల్లో నవంబర్ 30న రీపోలింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారని ఎస్ఈసీ వివరించింది.

బాధ్యతాయుత జర్నలిజం.. అవసరం!

సాంకేతిక మార్పులకు అనుగుణంగా మీడియా సాగాలి

యువ జర్నలిస్టులు కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి

జాతీయ పత్రికా దినోత్సవంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

జర్నలిజం ప్రవర్తనా నియమావళి కొత్త ఎడిషన్ విడుదల

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, అయితే భావప్రకటన స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతను కూడా జర్నలిజం సమతుల్యం చేయాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి, డిజిటల్ మీడియా పరిణామాలకు జర్నలిస్టులు అనుగుణంగా మారాలని, యువ జర్నలిస్టులు నిరంతరం కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్‌లు, తప్పుడు ప్రకటనలు, డిజిటల్ అరెస్టులు వంటి సవాళ్ల నేపథ్యంలో వార్తలను ప్రచురించే ముందు వాస్తవ నిర్ధారణ అత్యంత ముఖ్యమన్నారు.



ప్రెస్ కమిషన్ ఏర్పాటు చేయాలి..

జర్నలిస్టుల సంక్షేమం, ప్రయోజనాలు, రక్షణపై ప్రభుత్వాలకు తగిన సూచనలు చేసేందుకు ప్రత్యేకంగా 'ప్రెస్ కమిషన్' ఏర్పాటు చేయాలని ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజల గొంతుకగా మీడియా పనిచేయాలని, ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వార్తలు రాయడం ద్వారా స్వీయ నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. మరోవైపు మంగళగిరిలో ఈపూరి రాజారత్నం రచించిన 'జర్నలిజం-జర్నలిస్టులు' మూడో భాగం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో నాగార్జున వర్సిటీ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా తన అసలు పాత్రను కోల్పోతూ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న పరిస్థితి ఆందోళనకరమని ఆమె వ్యాఖ్యానించారు. వేగం కంటే నిజం, సంచలనం కంటే వాస్తవానికి జర్నలిస్టులు ప్రాధాన్యత ఇవ్వాలని రిటైర్డ్ ఐఐఎస్ అధికారి గుత్తికొండ కొండలరావు సూచించారు.

జర్నలిస్టుల రక్షణకు.. ప్రెస్ కమిషన్!

ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి డిమాండ్



విజయవాడ, నవంబర్ 16 (సమయం న్యూస్): పాత్రికేయుల సంక్షేమం, ప్రయోజనాలు, రక్షణపై ప్రభుత్వాలకు తగిన సూచనలు చేసేందుకు ప్రత్యేకంగా 'ప్రెస్ కమిషన్' ఏర్పాటు చేయాలని ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్, ప్రెస్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేసే క్రమంలో జర్నలిస్టులు సంఘటనా స్థలానికి దూరంగా ఉండాలన్న సూచనలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. అనంతరం రక్తదానం చేసిన పాత్రికేయులను అభినందిస్తూ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. జర్నలిస్టులకు అవసరమైనప్పుడు రక్తాన్ని రాయితీతో అందించాలని ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కోరారు. మరోవైపు మీడియా అకాడమీ, నాగార్జున వర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న జర్నలిజం డిప్లొమా కోర్సు విద్యార్థులతో ఆలపాటి సురేశ్ కుమార్ వర్చువల్‌గా మాట్లాడారు. ప్రజల గొంతుకగా మీడియా పనిచేయాలని, ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వార్తలు రాయడం ద్వారా స్వీయ నియంత్రణ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ బాబీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు

ఏఐ, డ్రోన్లతో మారుతున్న యుద్ధరంగ స్వరూపం

రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి

ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్‌లో రక్షణ దళాల అధిపతి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): కాలంతో పాటు యుద్ధరంగ స్వరూపం పూర్తిగా మారిపోతోందని, ఆధునిక సాంకేతిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తనను తాను మెరుగుపరుచుకుంటూ ఉండాలని రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఉపగ్రహ ఆధారిత నిఘా, డ్రోన్‌లు ఆధునిక యుద్ధ తంత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక యుద్ధ భూమిలో ఎవరూ సురక్షితంగా ఉండే అవకాశం లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. దిల్లీలో జరిగిన 'ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 3.0'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీడీఎస్ రాజా సుబ్రమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం యుద్ధ క్షేత్రం క్రమంగా విస్తరిస్తోందని తెలిపారు. గతంలో శత్రు దేశాలను ఓడించాలంటే కేవలం సైనికులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేవారని, కానీ నేడు దేశాన్ని అన్ని రకాలుగా బలహీనపరిచేందుకు పరిశ్రమలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, విద్యుత్ కేంద్రాలు, చివరికి పౌర నివాస ప్రాంతాలపైనా దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శత్రువుల నుంచి ఇలాంటి బహుముఖ దాడులను ఎదుర్కోవాలంటే అత్యంత బలమైన రక్షణ వ్యవస్థలు కావాలని స్పష్టం చేశారు. ఆధునిక యుద్ధాల్లో ఖర్చుల నియంత్రణ ఎంతో కీలకమని జనరల్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. చాలా తక్కువ ధరతో తయారు చేసిన డ్రోన్లను కూల్చివేయడానికి మిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక క్షిపణులను ఉపయోగిస్తే.. ఆ దేశ యుద్ధ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడిపోతుందని హెచ్చరించారు. ఇందుకు ఉదాహరణగా.. ఇటీవల అమెరికా తన పేట్రియాట్ క్షిపణులను వేగంగా ఖాళీ చేయడాన్ని మనం చూశామని, వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి అగ్రరాజ్యానికి అనేక ఏళ్లు పడుతుందని గుర్తుచేశారు. కాబట్టి అధునాతన ఆయుధాలతో పాటు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ ఆయుధాలను, రక్షణ పరికరాలను స్వయంగా తయారు చేసుకోవడంపై దేశాలు దృష్టి పెట్టాలని సూచించారు. తమ ఆర్థిక, సైనిక బలాన్ని పటిష్టం చేసుకోవాలనుకునే దేశాలకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా, కీలక ఖనిజాలపై నియంత్రణ చాలా అవసరమని సీడీఎస్ స్పష్టం చేశారు. వీటిపై పట్టు సాధించేందుకు ప్రపంచ దేశాల మధ్య పోటీ రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో అగ్రగామిగా ఉన్న అమెరికా, చైనాల మధ్య ఈ ఆధిపత్య పోరు మరింత స్పష్టంగా కనిపిస్తోందని, అదే సమయంలో ఇతర దేశాలు కూడా ఆ అంతరాన్ని వేగంగా తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. సుదీర్ఘకాలం కొనసాగే ఎలాంటి సంఘర్షణలనైనా ఎదుర్కొనేందుకు దేశాలు తమ స్వదేశీ తయారీ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

గూఢచర్యంలో హనీట్రాప్ భాగమే..

వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ కీలక వ్యాఖ్యలు!

సాంకేతికంగా లొంగదీసుకోలేకే శత్రు దేశాలు సోషల్ మీడియా వేదికగా 'వలపు వలలు' విసురుతున్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): భారత మిలటరీ వ్యవస్థ, దాని పరిశోధన విభాగాలు విదేశీ సైబర్ దాడులకు లొంగనంత అత్యంత సురక్షితంగా ఉన్నాయని, అందుకే విదేశీ ఇంటెలిజెన్స్ సంస్థలు సాంకేతికంగా దెబ్బతీయలేక 'హనీట్రాప్' (వలపు వల) మార్గాన్ని ఎంచుకున్నాయని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో హనీట్రాప్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా అశుతోశ్ దీక్షిత్ మాట్లాడుతూ.. "మిలటరీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అనేది పబ్లిక్ నెట్‌వర్క్ నుంచి పూర్తిగా వేరుగా ఉంటుంది. దానిపై ఎలాంటి సైబర్ దాడికి పాల్పడడం అసాధ్యం. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్.. సాంకేతికంగా వ్యవస్థను దెబ్బతీయలేక, మనుషులను టార్గెట్ చేసుకునే మార్గాన్ని ఎంచుకుంది. పబ్లిక్ సెక్టార్ లాబొరేటరీ సిబ్బంది, ప్రైవేట్ సెక్టార్‌లోని డిఫెన్స్ కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా ప్రేమ పేరుతో ట్రాప్ చేస్తున్నారు" అని తెలిపారు. వలపు వలలు అనేవి ఇంటెలిజెన్స్ గూఢచర్యంలో కేవలం ఒక చిన్న భాగం మాత్రమేనని, లోన్స్ పేరుతో, మార్కెట్ ఆశల పేరుతో ఇలా అనేక మార్గాల్లో ఈ కార్యకలాపాలు సాగుతున్నాయని ఆయన వివరించారు. మిలటరీ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు సాధ్యం కానప్పటికీ, వ్యవస్థ లోపలి వ్యక్తుల ద్వారా ప్రమాదం పొంచి ఉంటుందని, అందుకే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేటప్పుడే ఇలాంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా రక్షణ రంగాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి హనీట్రాప్ దాడులు ఎక్కువవుతున్నాయి. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి తన సహోద్యోగి మొబైల్‌లో మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారన్న ఆరోపణలపై ఇటీవల ఢిల్లీలో ఓ డిఫెన్స్ అధికారి అరెస్టయ్యారు. వ్యక్తిగత జీవితంలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయనకు.. పాకిస్థానీ గూఢచారిగా భావిస్తున్న ఓ మహిళతో సోషల్ మీడియా ద్వారా సాన్నిహిత్యం ఉన్నట్లు విచారణలో తేలింది. అచ్చం ఇలాంటి ఘటనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వెలుగు చూసింది. సోషల్ మీడియా ద్వారా పాకిస్థానీ మహిళతో స్నేహం చేస్తూ రహస్యాలు చేరవేస్తున్న ఇండియన్ నేవీ అధికారి ప్రదీప్ ముఖర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు, అంతర్జాతీయ స్థాయిలోనూ టెక్ దిగ్గజాలపై ఇలాంటి నిఘా నీడలు కమ్ముకుంటున్నాయి. ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా (చీజఅఎఱఱ) సీఈవో.. చైనా గూఢచారితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు సైతం సంచలనం సృష్టించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రక్షణ శాఖ మరింత అప్రమత్తమై కట్టుదిట్టమైన నిఘా చర్యలు చేపడుతోంది.

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు

- సుప్రీంకోర్టుకు రాహుల్!
- ఓటర్ల జాబితా సవరణలో ఏకపక్ష నిర్ణయాలంటూ ఆరోపణలు
- భారీగా ఓట్ల తొలగింపుపై సమాధానాలు కోరిన విపక్షాలు
- ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ప్రమాణపత్రాలకు డిమాండ్
- అధికారిక రికార్డులు బయట పెట్టాలంటూ న్యాయస్థానానికి విజ్ఞప్తి
- ఏకగ్రీవ నిర్ణయంతోనే ఉత్తర్వులు ఇచ్చామంటున్న ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై వివాదం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు ఇతర విపక్ష నేతలు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల సంఘానికి పది విభాగాల్లో మొత్తం 48 రాతపూర్వక ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తోపాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ప్రమేయం లేకుండానే కీలక నిర్ణయాలు తీసుకున్నారా అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యుల ఉమ్మడి నిర్ణయంతోనే సవరణ ఉత్తర్వులు జారీ చేసిందా, లేక ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారా అన్నది తేలాల్సి ఉందని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ముగ్గురు కమిషనర్లు స్వయంగా ప్రమాణపత్రాలు సమర్పించాలని కోరారు. అయితే అక్టోబర్ 26, నవంబర్ 14 తేదీల్లో డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ ఏటూరు ద్వారా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లలో ముగ్గురు సభ్యుల ఏకగ్రీవ నిర్ణయం మేరకే ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొందని పిటిషనర్లు వివరించారు. ఆ వాదనకు సంబంధించిన సమావేశాల వివరాలు, ఫైల్ నంబర్లు, అధికారిక రికార్డులను వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సమాచార వ్యవస్థలో మార్పులు చేసేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతి ఉందా, ఎన్నికల నమోదు అధికారుల ఉత్తర్వులు లేకుండానే సామూహికంగా ఓట్ల తొలగింపు జరిగిందా, సమాచార భద్రతపై తనిఖీలు నిర్వహించారా అనే అంశాలపై సమాధానాలు కోరారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులో మార్పులకు ఎవరు ఆమోదం తెలిపారు, రాష్ట్రాల వారీగా ఎంతమంది ఓటర్ల పేర్లు తొలగించారు, వాట్సాప్, వ్యక్తిగత ఈమెయిల్ల ద్వారా అధికారిక ఆమోదాలు పొందారా అనే ప్రశ్నలనూ లేవనెత్తారు. గతంలో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన సమాధానాలను కూడా పిటిషనర్లు ప్రస్తావించారు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన పుట్టస్వామి కేసు తీర్పును ఉదహరిస్తూ కీలక సమాచారం ఎన్నికల సంఘం వద్దే ఉన్నప్పుడు సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన సమాధానాలు కోరే అధికారం న్యాయస్థానానికి ఉందని పిటిషనర్లు వాదించారు. ఏదైనా అధికారిక రికార్డును గోప్యంగా ఉంచాలనుకుంటే అందుకు నిర్దిష్ట కారణాలను కోర్టుకు వివరించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచానికి భారత్ సరికొత్త మార్గం చూపింది!

భారత్‌పై బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ ప్రశంసలు

స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ పురోగతి అద్భుతమని కితాబు





ముంబై, నవంబర్ 16 (సమయం న్యూస్): పర్యావరణహిత ఇంధనాలను ప్రోత్సహించడంలో భారత్ సాధిస్తున్న అద్భుత పురోగతిని బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్ కొనియాడారు. ప్రతిష్ఠాత్మక 'ఎర్త్‌షాట్ ప్రైజ్' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన ఆయన, సోమవారం ముంబైలో నిర్వహించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్ ఇంపాక్ట్ అసెంబ్లీ'లో ప్రసంగిస్తూ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50 శాతం శిలాజేతర ఇంధనాల ద్వారా సమకూర్చుకోవాలన్న లక్ష్యాన్ని భారత్ నిర్ణీత గడువుకు ఐదేళ్ల ముందే చేరుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. భారత్‌లో సౌర ఇంధన వినియోగం వేగంగా పెరుగుతోందని, దశాబ్ద కాలంలోనే సౌరవిద్యుత్ సామర్థ్యం 50 రెట్లు వృద్ధి చెందడం విశేషమని మెచ్చుకున్నారు. వాతావరణ మార్పుల సంబంధిత సమస్యలకు పరిష్కారాలు చూపడంలో అంతర్జాతీయంగా భారత్ పాత్ర నానాటికీ పెరుగుతోందని ప్రిన్స్ విలియమ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ముందు ఆర్థికాభివృద్ధి లేదా పర్యావరణ పరిరక్షణ అనే వేర్వేరు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయనే తప్పుడు భావన ప్రపంచవ్యాప్తంగా ఉందని వ్యాఖ్యానించారు. అయితే, ఆ రెండింటినీ కలిపి సమన్వయంతో అభివృద్ధి పథాన నడవొచ్చని భారత్ నిరూపించిందని ఆయన స్పష్టం చేశారు. "రంగులమయమైన, సంక్లిష్టమైన, పలు ప్రత్యామ్నాయాలతో కూడిన ఓ కొత్త చిత్రాన్ని భారత్ ప్రపంచానికి చూపించింది. ఇది కేవలం ఇంధనానికి సంబంధించిన మార్పు మాత్రమే కాదు, ప్రజలు మెరుగైన జీవన విధానాన్ని పొందే ప్రక్రియ" అని ప్రిన్స్ విలియమ్ అభివర్ణించారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియమ్ 2020లో 'ఎర్త్‌షాట్ ప్రైజ్'ను ఏర్పాటు చేశారు. ఆరో విడత ఎర్త్‌షాట్ ప్రైజ్ ప్రదానోత్సవ కార్యక్రమం నేడు (మంగళవారం, నవంబర్ 17) ముంబైలో అట్టహాసంగా జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 15 మంది ఫైనలిస్టులలో ఐదుగురు విజేతలను ప్రకటించి, ఒక్కొక్కరికి 1 మిలియన్ పౌండ్ల చొప్పున నగదు బహుమతి అందించనున్నారు.

కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్

ఎల్ఈటీ కమాండర్ లతీఫ్ భట్ మృతి ■ మరో ఉగ్రవాది కూడా హతం

కుల్గాం, నవంబర్ 16 (సమయం న్యూస్): జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు చేపట్టిన భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ మహ్మద్ లతీఫ్ భట్ హతమయ్యాడు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా లారూ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఉగ్రవాది కూడా మరణించాడు. అతడిని ఉమర్‌గా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న నిఘా సమాచారంతో భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. నవంబర్ 11న కుల్గాం జిల్లాలోని మీర్ బజార్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ పోస్టుపై జరిగిన దాడికి లతీఫ్ భట్ సూత్రధారిగా వ్యవహరించినట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. ఆ దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోవడంతో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఐదు రోజుల పాటు అనుమానిత ప్రాంతాలను జల్లెడపట్టి చివరకు లారూ వద్ద ఉగ్రవాదుల ఆచూకీ గుర్తించాయి. లతీఫ్ భట్‌కు దక్షిణ కశ్మీర్‌లో జరిగిన పలు ఉగ్ర దాడులతో సంబంధం ఉన్నట్లు భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. తాజా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ ధ్రువీకరించినట్లు వార్తలు వెల్లడించాయి. మరో ఉగ్రవాది పూర్తి వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఎన్‌కౌంటర్ అనంతరం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



ఓట్ చోర్.. గద్దీ చోడ్

భారత్ సమ్మిట్‌లో విదేశీ నేత వ్యాఖ్యలపై దుమారం!

ఇటలీ నేత వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్

జోక్యం వీసా నిబంధనల ఉల్లంఘనేనని వెల్లడి

రాహుల్ గాంధీపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్): హైదరాబాద్ వేదికగా జరిగిన 'భారత్ సమ్మిట్' సమావేశంలో ఇటలీకి చెందిన రాజకీయ నాయకుడు జాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు ఉపయోగించిన 'ఓట్ చోర్, గద్దీ చోడ్' (ఓట్లను దొంగిలించిన వారు గద్దె దిగాలి) అనే నినాదాన్ని యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్ అయిన ఫిలిబెక్ ఈ సమ్మిట్‌లో ప్రస్తావించడం వివాదానికి దారితీసింది. భారత్‌లో ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఒక వ్యక్తి, ఒక ఓటు' సిద్ధాంతాన్ని కాపాడటానికి రాహుల్ గాంధీ పోరాడుతున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈ సమ్మిట్‌లో ఒక విదేశీ పౌరుడు భారత అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యానించడంపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. విదేశీయులు ఎవరైనా భారతదేశానికి కేవలం కాన్ఫరెన్స్ లేదా సెమినార్లలో పాల్గొనేందుకే 'కాన్ఫరెన్స్ వీసా'పై వస్తారని, అలా వచ్చి దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, విమర్శలు చేయడం వీసా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ స్వయంగా పాల్గొనడమే కాకుండా, విదేశీ నేత ఆ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో ఆనందంగా నవ్వుతూ చప్పట్లు కొట్టడం పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. విదేశీ నాయకులను ఆహ్వానించి, దేశ అంతర్గత రాజకీయాలపై, ఎన్నికల వ్యవస్థపై విమర్శలు చేయించడంపై విపక్షాలు అధికార కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

17 నుంచి అంతర్జాతీయ కొబ్బరి సమాజ సమావేశం!

మంత్రుల స్థాయి భేటీకి కేరళలోని కోచ్చి ఆతిథ్యం

సమావేశాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్‌నాథ్

పరిశ్రమ అభివృద్ధి, సుస్థిరతపై సభ్య దేశాల చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): అంతర్జాతీయ కొబ్బరి సమాజం 62వ సమావేశం, మంత్రుల స్థాయి భేటీ నవంబర్ 17 నుంచి 20 వరకు కేరళలోని కోచ్చిలో జరగనుంది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన కొబ్బరి అభివృద్ధి బోర్డు, ఐసీసీ సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఈ సమావేశాన్ని ప్రారంభించనున్నారు. వివిధ సభ్య దేశాల మంత్రులు, అధికారులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొంటారు. ప్రపంచ కొబ్బరి పరిశ్రమ అభివృద్ధి, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు.

శ్రీశ్రీ వర్సిటీలో ఐకానిక్ టవర్ ప్రారంభం!

సాంస్కృతిక వారసత్వం, ఆధునిక విద్యకు ప్రతీకగా టవర్

టవర్‌ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

గిరిజన విద్యార్థుల కోసం స్కూల్ కనెక్ట్ తీసుకురావాలి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపు

కటక్, నవంబర్ 16 (సమయం న్యూస్): ఒడిశా కటక్‌లోని శ్రీశ్రీ యూనివర్సిటీలో ఐకానిక్ టవర్‌ను ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ప్రారంభించారు. భారత సాంస్కృతిక వారసత్వం, ఆధునిక విద్యా ఆకాంక్షల సమ్మేళనానికి ఈ టవర్ ప్రతీకగా నిలుస్తుందని ఆయన అన్నారు. దేశంలో ఉన్నత విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. గిరిజన విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా 'స్కూల్ కనెక్ట్' కార్యక్రమాలను ప్రారంభించాలని ఒడిశాలోని విశ్వవిద్యాలయాలకు సూచించారు. 'రాష్ట్ర ప్రథమం' భావనతో విద్యార్థులు ముందుకు సాగాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారత్ బలమైన, స్వావలంబన దేశంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

రామ్ బక్స్ సింగ్‌కు స్మారక తపాలా బిళ్ల!

తపాలా బిళ్లను విడుదల చేసిన కేంద్ర సహాయ మంత్రి రామ్‌దాస్

బయోగ్యాస్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో విశేష సేవలు

రామ్ బక్స్ సింగ్ సేవలకు గుర్తింపుగా తపాలా శాఖ గౌరవం

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): బయోగ్యాస్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో విశేష సేవలందించిన శాస్త్రవేత్త శ్రీ రామ్ బక్స్ సింగ్ గౌరవార్థం భారత తపాలా శాఖ స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది. కేంద్ర సహాయ మంత్రి రామ్‌దాస్ అథావలే, ఢిల్లీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కర్నల్ అఖిలేష్ కుమార్ పాండే ఈ బిళ్లను ఆవిష్కరించారు. 1957లో సీతాపూర్‌లో తొలి విజయవంతమైన గోబర్ గ్యాస్ ప్లాంట్లలో ఒకదాన్ని ప్రారంభించిన రామ్ బక్స్ సింగ్, 15కుపైగా దేశాల్లో పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు సేవలందించారు. ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ స్మారక తపాలా బిళ్లను విడుదల చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి!

వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ అధికారులకు ఆదేశాలు

ప్రణాళికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పని చేయాలి

రాజధాని ఢిల్లీలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమల్లోకి

కాలుష్య నిబంధనలు పాటించని 191 పరిశ్రమల మూసివేత



న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రంగా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర పర్యావరణ శాఖ అప్రమత్తమైంది. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ ఢిల్లీ పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలను సమీక్షించి, కేవలం ప్రణాళికలకే పరిమితం కాకుండా కఠినమైన, సమయపాలిత, సమన్వయంతో కూడిన క్షేత్రస్థాయి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఢిల్లీలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్3 అమల్లో ఉంది. నవంబర్ 16న ఉదయం 1 గంటకు ఢిల్లీ ఏక్యూఐ 211 (పూర్)గా నమోదైంది. అయితే కాలుష్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాలుష్య నియంత్రణలో భాగంగా రోడ్లపై దుమ్ము నివారణ, వాహనాల కాలుష్య నియంత్రణ, నిర్మాణ కార్యకలాపాలపై ఆంక్షలు, బహిరంగంగా చెత్త దహనం నివారణ, పరిశ్రమల ఉద్గారాలపై కఠిన చర్యలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు పాటించని 191 కాలుష్యకారక పరిశ్రమలను మూసివేయాలని కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది. ప్రజలు వీలైనంత వరకు ప్రజా రవాణా లేదా ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని అధికారులు సూచించారు.

నశా ముక్త్ భారత్‌లో.. యువత భాగస్వామ్యం!

36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 429 కార్యక్రమాలు

చురుగ్గా పాల్గొన్న 81,622 మంది యువత, పౌరులు

క్రీడలు, యూత్ పార్లమెంట్ల ద్వారా అవగాహన సదస్సులు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): నశా ముక్త్ యువఉవికసిత్ భారత్ ప్రచారంలో భాగంగా మేరా యువ భారత్ ఆధ్వర్యంలో 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 429 కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో 81,622 మంది యువత, పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు, యూత్ పార్లమెంట్ల ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యసన నివారణపై అవగాహన కల్పించారు.

కన్నుల పండువగా శ్రీగిరి గిరిప్రదక్షిణ!

కోటి సోమవారం వేళ భక్తుల భక్తిపారవశ్యం.. గోవింద నామస్మరణతో సాగిన పల్లకి సేవ

- స్వామివారికి ఇంటింటా మంగళ నీరాజనాలు
- బాపూజీ గోశాలలో ప్రత్యేక గోపూజ నిర్వహణ
- ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- శ్రవణా నక్షత్రం కలిసిరావడం విశేష అనుగ్రహమన్న భక్తజనం





ఒంగోలు, నవంబర్ 16 (సమయం న్యూస్): ప్రతి నెలా శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే 'శ్రీగిరి గిరిప్రదక్షిణ' మహోత్సవం ఈసారి కన్నులపండువగా సాగింది. పరమపవిత్రమైన కార్తీక దామోదర మాసం, శుద్ధ సప్తమి 'కోటి సోమవారం' పర్వదినాన శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవంలో భాగంగా తొలుత శ్రీగిరి పాదపీఠం వద్ద ఉన్న బాపూజీ గోశాలలో ప్రత్యేక గోపూజ నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చారు. భక్తులు తమ భుజాలపై స్వామివారి పల్లకిని మోస్తూ, దివ్యమైన గోవింద నామస్మరణ నడుమ భక్తిపారవశ్యంతో గిరిప్రదక్షిణను కొనసాగించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు..

కోటి సోమవారం పర్వదినం కావడంతో గిరిప్రదక్షిణ మార్గంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రదక్షిణ మార్గంలోని గృహస్తులందరూ తమ ఇళ్ల ఎదుట ముగ్గులు వేసి, స్వామివారి ఉత్సవమూర్తులకు మంగళహారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గిరిప్రదక్షిణ పూర్తయిన తర్వాత భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో, అందులోనూ అత్యంత మహిమాన్వితమైన కోటి సోమవారం నాడు శ్రవణా నక్షత్రం కలిసిరావడం స్వామివారి విశేష అనుగ్రహమని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పవిత్ర దినాన స్వామివారి దర్శనం, దీపారాధన చేయడం వల్ల కోటి సోమవారాల పుణ్యఫలం లభించిందని పేర్కొన్నారు. ఈ మహోత్సవ ఏర్పాట్లను శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ సేవా భక్తులు అచ్యుత పూర్ణచంద్రరావు-లక్ష్మీ సుభాషిణి, తుమ్మపూడి బుచ్చిబాబు-శేషు కుమారి, గ్రంధి సుధీర్-లలితా శ్రావణి, ఆలపాటి విష్ణువర్ధన్ రావు-లక్ష్మీ, బొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు-సుజాత దంపతులతో పాటు పెనుగొండ శ్రీనివాస రావు, తాతా రామకృష్ణ పర్యవేక్షించారు. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి వలేటి కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు కనమర్లపూడి బాల కోటేశ్వరరావు, ధనిశెట్టి రామునాయుడు, దోగిపర్తి మల్లికార్జున రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలందించారు.

ప్రకటనలకే.. పరిమితమవుతున్న మీడియా!

- అసలు పాత్ర కోల్పోతోందన్న డాక్టర్ కె. జ్యోతిర్మయి
- మంగళగిరిలో 'జర్నలిజం-జర్నలిస్టులు' పుస్తకావిష్కరణ
- పాలకులను ప్రశ్నించడమే మీడియా ప్రధాన కర్తవ్యం
- రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు తలొగ్గకూడదన్న వక్తలు
- జాతీయ పత్రికా దినోత్సవం వేడుకల్లో ఘన నివాళి



మంగళగిరి (సమయం న్యూస్): ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా తన అసలు పాత్రను కోల్పోతూ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న పరిస్థితి అత్యంత ఆందోళనకరమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ కె.జ్యోతిర్మయి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మంగళగిరి ప్రెస్ క్లబ్, రాజారత్నం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. రచయిత, సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్ ఈపూరి రాజారత్నం రచించిన 'జర్నలిజంఉజర్నలిస్టులు (జర్నలిస్టుల హ్యాండ్‌బుక్)' మూడో భాగం పుస్తకావిష్కరణను సోమవారం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. మీడియా ప్రజలకు నిజాన్ని తెలియజేసే బాధ్యతను ఏమాత్రం విస్మరించకూడదని స్పష్టం చేశారు.

వేగం కంటే.. వాస్తవానికే ప్రాధాన్యం..

ఈ సభలో రిటైర్డ్ ఐఐఎస్ అధికారి డాక్టర్ గుత్తికొండ కొండలరావు (జి.కె.రావు) మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం లాంటిదని అభివర్ణించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలకుల బాధ్యతలను ప్రశ్నించడం మీడియా ప్రధాన కర్తవ్యమని గుర్తు చేశారు. వార్తల ప్రసారంలో వేగం కంటే నిజం, సంచలనం కంటే వాస్తవానికి జర్నలిస్టులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫేక్ న్యూస్, రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా వృత్తి విలువలను కాపాడుకోవాలని కోరారు. తెలుగు జర్నలిజాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యూస్ ఎడిటర్ కొలికపూడి రూఫస్, సీనియర్ జర్నలిస్ట్ శిరందాసు నాగార్జున, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, రాజారత్నం ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు ఈపూరి అనూరాధ, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ గోలి మాధవరావు, జర్నలిజం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతలో.. ఏమాత్రం నిర్లక్ష్యం వద్దు!

- రైలు కార్యకలాపాలపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సమీక్ష
- అధికారులకు సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దిశానిర్దేశం
- నిబంధనల అమలులో కచ్చితత్వం పాటించాలని ఆదేశం
- కేబుల్ కట్ ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు
- సమీక్షలో పాల్గొన్న ఏజీఎం, పలు డివిజన్ల డీఆర్ఎంలు



సికింద్రాబాద్ (సమయం న్యూస్): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల రాకపోకల భద్రతను మరింత పటిష్టం చేయడంపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో జోన్ వ్యాప్తంగా ఉన్న భద్రతా పరిస్థితులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. భద్రతా నిబంధనలను ప్రతి స్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని జీఎం అధికారులను ఆదేశించారు. భద్రతా పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలని సూచించారు. యార్డులు, బ్లాక్ సెక్షన్లతో పాటు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

సమన్వయంతో ముందుకు సాగాలి..

కేబుల్ కట్ ఘటనలను అరికట్టేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జీఎం ఆదేశించారు. రైల్వే పట్టాల సమీపంలోని ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైళ్ల రాకపోకలు సురక్షితంగా, సజావుగా సాగేందుకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ రాజేష్ పి.ఖాడే, వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షకు హాజరయ్యారు.

ఎత్తుగడల వెనుక ఎత్తుగడ!

ఒక అడుగు వెనక్కి వేయడం ఓటమా? ప్రత్యర్థి కదలికలను గమనిస్తూ వేచి ఉండటం బలహీనతా? మౌనంగా ఉండటం చేతకానితనమా? వ్యూహాత్మక ప్రపంచంలో ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు అంత సులభంగా దొరకవు. చైనా చారిత్రక వ్యూహసూక్తుల సంకలనంగా ప్రసిద్ధి చెందిన 'ముప్పై ఆరు వ్యూహాలు' నేటి రాజకీయ, వ్యాపార, అంతర్జాతీయ పరిణామాలను విశ్లేషించడానికి ఆసక్తికరమైన దృక్కోణాన్ని అందిస్తాయి. ప్రత్యర్థి బలాన్ని నేరుగా ఢీకొనకుండా పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకోవడం, సరైన సమయం కోసం వేచి చూడటం, సమాచారాన్ని వ్యూహాత్మకంగా వినియోగించడం వంటి ఆలోచనలు వాటిలో కనిపిస్తాయి. తాజాగా ప్రపంచ సాంకేతిక రంగంలో చోటుచేసుకున్న ఎన్విడియా నాయకత్వ మార్పు ఈ వ్యూహాలపై మరోసారి చర్చకు అవకాశం కల్పించింది. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో కీలక స్థానంలో ఉన్న సంస్థలో నాయకత్వ మార్పు ఎందుకు ప్రాధాన్యం సంతరించుకుంది? సంస్థ పాలన, సమాచార భద్రత, అంతర్జాతీయ పోటీ మధ్య సంబంధం ఏమిటి? ఈ పరిణామాలు వ్యూహం అంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, సొంత వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమని గుర్తుచేస్తున్నాయి.



ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
ఫోన్: 9640466464

బలంతో కాదు.. బుర్రతోనే అసలు ఆట!

చైనా 36 వ్యూహాల్లో ప్రతి ఎత్తుగడ వెనుక ఒక ప్రత్యేక ఆలోచన కనిపిస్తుంది. ప్రత్యర్థి దృష్టిని ఒకవైపు మళ్లించి మరోవైపు లక్ష్యాన్ని సాధించడం, అనుకూల సమయం కోసం వేచి చూడటం, బలమైన ప్రత్యర్థిని అతనికి అనుకూలమైన స్థానం నుంచి బయటకు రప్పించడం వంటి పద్ధతులు వాటిలో ఉన్నాయి. 'తూర్పున దాడి చేస్తున్నట్లు చూపి పడమర వైపు లక్ష్యాన్ని సాధించడం', 'పర్వతంపై ఉన్న పులిని మైదానంలోకి రప్పించడం', 'ప్రత్యర్థుల మధ్య విభేదాలను ఉపయోగించుకోవడం' వంటి ఎత్తుగడలు వ్యూహాత్మక ఆలోచనకు ఉదాహరణలు. మరికొన్ని ప్రత్యక్ష ఘర్షణకు బదులుగా సహనం, పరిశీలన, సమాచార సేకరణకు ప్రాధాన్యం ఇస్తాయి. అయితే చారిత్రక యుద్ధతంత్రాలను నేటి సమాజంలో యథాతథంగా అనుసరించాలనే అర్థం కాదు. వాటి నుంచి పరిస్థితులను ముందుగానే అంచనా వేయడం, తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండటం, సొంత బలహీనతలను గుర్తించి సరిదిద్దుకోవడం వంటి పాఠాలను గ్రహించాలి. వ్యూహం పేరుతో మోసం, అనైతిక చర్యలను సమర్థించడం సరికాదు. ఆధునిక ప్రపంచంలో చట్టబద్ధత, పారదర్శకత, నైతికత కూడా విజయానికి కీలకమైన అంశాలు.

చిప్ రంగంలో భద్రతా విధానాలు ఎందుకు కీలకం?

ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ అధునాతన చిప్‌లకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగంలో సాంకేతిక ఆధిపత్యం సాధించడం సంస్థలకు వ్యాపార అవకాశాలను అందించడమే కాకుండా, దేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలతోనూ ముడిపడుతోంది. అందుకే చిప్‌ల రూపకల్పన, తయారీ, ఎగుమతులు, వినియోగం, సరఫరా వ్యవస్థలపై ప్రభుత్వాలు ప్రత్యేక నియంత్రణలు విధిస్తున్నాయి. అమెరికా కూడా కొన్ని అధునాతన చిప్‌ల ఎగుమతులపై నియంత్రణలు అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ సాంకేతిక సంస్థలకు ఎగుమతి నిబంధనల పాటింపు, సమాచార రక్షణ, సరఫరా వ్యవస్థల పర్యవేక్షణ అత్యంత కీలకం. ఎన్విడియా బోర్డు ప్రకటించిన స్వతంత్ర విచారణ కూడా సంస్థాగత భద్రతపై ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఏ సంస్థలోనైనా నాయకత్వ మార్పులు, అంతర్గత సమీక్షలు, భద్రతా విధానాలు కేవలం పరిపాలనా అంశాలు కావు. వాటి ప్రభావం పెట్టుబడిదారుల విశ్వాసం, వినియోగదారుల నమ్మకం, అంతర్జాతీయ వ్యాపార సంబంధాలపై పడుతుంది. సాంకేతికంగా ఎంత బలంగా ఉన్నా, సంస్థాగత పారదర్శకత, జవాబుదారీతనం లోపిస్తే విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుంది.

అగ్రస్థానంలో అనూహ్య మార్పు.. అసలేం జరిగింది?

ప్రపంచ కృత్రిమ మేధ రంగానికి అవసరమైన అధునాతన చిప్‌ల రూపకల్పన, సరఫరాలో కీలక సంస్థగా ఎదిగిన ఎన్విడియా నవంబర్ 12, 2026న కీలక ప్రకటన చేసింది. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు సభ్యుడిగా ఉన్న జెన్సన్ హువాంగ్ రాజీనామాను తక్షణమే అమల్లోకి తీసుకున్నట్లు వెల్లడించింది. సంస్థ ఆర్థిక విభాగం అధిపతి కొలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించింది. శాశ్వత వారసుడి ఎంపిక కోసం అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలించనున్నట్లు బోర్డు తెలిపింది. హార్వే సి. జోన్స్‌ను బోర్డు తొలి ఛైర్మన్‌గా నియమించింది. అయితే రాజీనామాకు నిర్దిష్ట కారణాన్ని ఆ ప్రకటన వెల్లడించలేదు. అంతకుముందు నవంబర్ 8న సంస్థ బోర్డు ఒక స్వతంత్ర విచారణకు ఆదేశించింది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ విదేశీ నిఘా ప్రయత్నానికి లక్ష్యంగా మారి ఉండవచ్చన్న వార్తా కథనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ప్రకటించింది. సంస్థ రహస్యాలు లేదా అమెరికా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు నమ్మడానికి తమకు కారణం లేదని స్పష్టం చేసింది. హువాంగ్ విచారణకు సహకరిస్తారని, ఆయన నాయకత్వంపై తమకు విశ్వాసం ఉందని కూడా వెల్లడించింది. అయితే నవంబర్ 12నాటి రాజీనామా ప్రకటనలో నవంబర్ 8నాటి విచారణను కారణంగా పేర్కొనలేదు.

ఆధిపత్యం తాత్కాలికం.. విశ్వాసమే శాశ్వతం!

ప్రతి పోరాటంలో గెలవడం కంటే, అనవసరమైన పోరాటాన్ని నివారించడం కొన్నిసార్లు గొప్ప విజయం. ప్రత్యర్థి కదలికలను అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో, సొంత వ్యవస్థలోని బలహీనతలను గుర్తించి సరిదిద్దుకోవడమూ అంతే అవసరం. చైనా 36 వ్యూహాలు పరిస్థితులను అంచనా వేయడం, సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మకంగా వ్యవహరించడం వంటి అంశాలను గుర్తుచేస్తాయి. ఎన్విడియా పరిణామాలు నాయకత్వ బాధ్యత, సంస్థాగత పారదర్శకత, సమాచార భద్రత, నమ్మకం వంటి అంశాల ప్రాధాన్యాన్ని ముందుకు తెస్తున్నాయి. ఆరోపణలు లేదా అనుమానాల ఆధారంగా వ్యక్తులపై తుది నిర్ణయాలకు రావడం సరికాదు. అధికారిక ప్రకటనలు, నిర్ధారిత ఆధారాలు, విచారణ ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాపార సంస్థలకు లాభాలు, సాంకేతిక ఆధిపత్యం ఎంత అవసరమో చట్టపాలన, జవాబుదారీతనం, ప్రజల విశ్వాసం కూడా అంతే ముఖ్యం. ప్రపంచాన్ని మార్చగల చిప్‌ను రూపొందించడం సాంకేతిక విజయం కావచ్చు. కానీ ఆ సాంకేతికత వెనుక ఉన్న సంస్థపై ప్రపంచం నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన వ్యూహాత్మక విజయం



రిజర్వేషన్ కోరడం.. హక్కు కాదు!

తమ స్థానాన్ని ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని అడగలేరు

స్థానిక సంస్థల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

రొటేషన్ విధానం రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారమే

మహారాష్ట్ర నిబంధనల చెల్లుబాటును సమర్థించిన ధర్మాసనం

ముంబై హైకోర్టు తీర్పును సవాల్ చేసిన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల అమలు, రొటేషన్ విధానంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. తమ నియోజకవర్గం లేదా స్థానాన్ని కచ్చితంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ చేయాలని కోరే చట్టబద్ధమైన లేదా ప్రాథమిక హక్కు ఏ వ్యక్తికీ లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల రొటేషన్ విధానాన్ని నిర్ణయించడం అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారమేనని తేల్చిచెప్పింది. మహారాష్ట్ర జిల్లా పరిషత్, పంచాయత్ సమితి నిబంధనలు-2025లోని రూల్-12 చెల్లుబాటును సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది.

ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేం..

స్థానిక సంస్థల రిజర్వేషన్ల రొటేషన్ విధానానికి సంబంధించి గతంలో ముంబై హైకోర్టు వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ వాదనలను తోసిపుచ్చుతూ ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రిజర్వేషన్ల కేటాయింపు, రొటేషన్ ప్రక్రియలకు సంబంధించిన ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో న్యాయస్థానాలు అనవసరంగా జోక్యం చేసుకోలేవని ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు!

- 19 నుంచి 22 వరకు 85వ వార్షిక ఐఆర్‌సీ సదస్సు
- 3,000 మందికి పైగా హాజరుకానున్న ప్రతినిధులు
- 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో 18న టెక్నికల్ ఎగ్జిబిషన్
- రామప్ప దేవాలయ ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు



హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్) : హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు 85వ వార్షిక ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు నిర్వహించనున్నారు. దేశ, విదేశాల నుంచి రోడ్డు ఇంజినీర్లు, అధికారులు, మౌలిక వసతుల నిపుణులతో సహా 3 వేల మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఇందుకోసం సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. సదస్సు ఏర్పాట్లపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు వచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్యాన్ని, నగర సంస్కృతి, వారసత్వం, ఆహార ప్రత్యేకతలను పరిచయం చేయనున్నట్లు తెలిపారు. ఆధునిక మౌలిక వసతులతో తెలంగాణ అభివృద్ధిని కూడా ప్రతినిధులకు చూపించనున్నట్లు పేర్కొన్నారు. టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను నవంబర్ 18న ప్రారంభించనున్నారు. ఇందులో దేశీయ, అంతర్జాతీయ సంస్థలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, ప్రభుత్వ శాఖలు పాల్గొంటాయి. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రామప్ప దేవాలయ ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతినిధుల వసతి, రవాణా, ఆతిథ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 19, 20, 21 తేదీల సాయంత్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నవంబర్ 22న ప్రతినిధులు, వారి వెంట వచ్చే వారికి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పర్యటనలు ఏర్పాటు చేయనున్నారు. కాగా.. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 1934లో స్థాపించబడిన రహదారుల రంగంలోని జాతీయ స్థాయి ప్రముఖ సంస్థ. రోడ్లు, వంతెనల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన ప్రమాణాలు, మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు ఇంజినీర్లు, పరిశోధకులు, రహదారి సంస్థలకు జాతీయ వేదికగా ఇది పనిచేస్తోంది.

గిరిజనులకు.. అటవీ భూ హక్కులు!

- ఆగస్టు 31 నాటికి 25.42 లక్షల హక్కుల పట్టాల పంపిణీ
- తెలంగాణలో 2,31,456.. ఏపీలో 2,28,489 పట్టాలు
- హక్కుల గుర్తింపు ప్రక్రియలో గ్రామసభలదే కీలక పాత్ర
- పీఎం కిసాన్, రుణాలు, పంట బీమా వంటి ప్రయోజనాలు

న్యూఢిల్లీ, నవంబర్ 16 (సమయం న్యూస్) : అటవీ హక్కుల చట్టంఉ2006 ద్వారా గిరిజనులు, సంప్రదాయ అటవీ నివాసుల భూ, జీవనోపాధి హక్కులకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తోంది. 2026 ఆగస్టు 31 నాటికి దేశవ్యాప్తంగా 25.42 లక్షల అటవీ హక్కుల పట్టాలు పంపిణీ చేసి, సుమారు 238 లక్షల ఎకరాలపై హక్కులు గుర్తించారు. ఇందులో తెలంగాణలో 2,31,456, ఆంధ్రప్రదేశ్‌లో 2,28,489 పట్టాలు పంపిణీ అయ్యాయి. కాగా, ఈ అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియలో గ్రామసభ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. హక్కులు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడంతో లబ్ధిదారులు పీఎం-కిసాన్, రుణాలు, పంట బీమా తదితర పథకాల



ప్రయోజనాలు పొందేందుకు వీలు కలుగుతుంది. కేంద్రం ప్రారంభించిన నేషనల్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా దావాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించనున్నారు.

సచిన్‌తో గల్లీ క్రికెట్ ఆడిన బ్రిటన్ రాజదంపతులు!

- ముంబైలో చిన్నారులతో కలిసి సందడి చేసిన విలియం, కేట్
- బౌలింగ్ చేసిన యువరాజు.. బ్యాట్ పట్టిన కేట్
- పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో క్రికెట్
- ఆట అనంతరం సంప్రదాయ కుల్హడ్ చాయ్ ఆస్వాదన



ముంబై, నవంబర్ 16 (సమయం న్యూస్): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య కేట్ మిడిల్టన్ భారత్ పర్యటనకు వచ్చారు. 3 రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ముంబైకి చేరుకున్న ఈ రాజదంపతులు.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్స్ విలియం, కేట్‌తో పాటు సచిన్ టెండూల్కర్, భారత మాజీ మహిళా క్రికెటర్ పూనమ్ రౌత్ పాల్గొన్నారు. 'ది రైట్ పిచ్' అనే సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రికెట్ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంచడం, వారికి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రిన్స్ విలియం బౌలింగ్ చేయగా.. కేట్ బ్యాటింగ్ చేశారు. స్థానిక పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కొందరు రాజదంపతులతో కలిసి క్రికెట్ ఆడగా.. మరికొందరు పక్కన ఉండి ఆటను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం, కేట్ 2016లో భారత్‌లో పర్యటించినప్పుడు కూడా ముంబైలోని ఓవల్ మైదానంలో స్థానిక చిన్నారులతో క్రికెట్ ఆడారు. అప్పట్లోనూ సచిన్ టెండూల్కర్ వారితో కలిసి పాల్గొన్నారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో కలిసి క్రికెట్ ఆడటంతో ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. క్రికెట్ ఆడిన తర్వాత రాజదంపతులు సచిన్‌తో కలిసి సంప్రదాయ మట్టి కప్పుల్లో అందించే కుల్హడ్ చాయ్‌ను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం స్థాపించిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్' వార్షిక అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ జంట భారత్‌కు వచ్చింది. నవంబర్ 17న జరగనున్న ఈ వేడుకలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న పరిష్కారాలు చూపిన ఐదు ప్రాజెక్టులకు ఒక్కొక్కటి మిలియన్ పౌండ్ల చొప్పున బహుమతి అందించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. అలియా భట్, సోనమ్ కపూర్, రామీ మాలెక్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు. గాయని శ్రేయా ఘోషల్, బ్రిటిష్ పాప్ బ్యాండ్ టేక్ దట్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. రాజదంపతులు ఈ పర్యటనలో భాగంగా ముంబై మెట్రో ప్రయాణం, భారతీయ సినిమా, ఫ్యాషన్, పర్యావరణ ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజదంపతులు పాల్గొంటారు. నవంబర్ 18న న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన తదుపరి వారి పర్యటన ముగియనుంది.



ఐసీసీ చైర్మన్‌గా మరోసారి జై షా!

రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన భారత క్రికెట్ నిర్వాహకుడు

బాలి (ఇండోనేషియా), నవంబర్ 16 (సమయం న్యూస్): అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వార్తలు వెలువడ్డాయి. ఇండోనేషియాలోని బాలిలో నిర్వహించిన ఐసీసీ బోర్డు సమావేశాల అనంతరం ఆయనను మరోసారి చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. ఇంగ్లండ్, జింబాబ్వే, న్యూజిలాండ్‌తోపాటు అసోసియేట్ సభ్య దేశాల ప్రతినిధులు ఆయన నాయకత్వానికి మద్దతు తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ క్రికెట్ కీలక మార్పుల దశలో ఉన్న సమయంలో జై షాకు మరోసారి బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఆగస్టు 27న తొలిసారి ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి చైర్మన్ గ్రెగ్ బార్క్లే స్థానంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కేవలం 36 ఏళ్ల వయసులో ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఆ పదవిని అధిష్ఠించిన అత్యంత పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందారు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలెస్ వేదికగా జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి ప్రవేశించనుండటం జై షా నాయకత్వానికి కీలక అంశంగా మారనుంది. శతాబ్దానికి పైగా విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కనుంది. మహిళా క్రికెట్ అభివృద్ధి, అసోసియేట్ సభ్య దేశాలకు మరిన్ని అవకాశాలు, అంతర్జాతీయ పోటీల నిర్వహణ, ద్వైపాక్షిక సిరీస్‌ల బలోపేతం వంటి అంశాలపై ఐసీసీ దృష్టి సారించనుంది. జై షా మరోసారి ఎన్నిక కావడంపై ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ హర్షం వ్యక్తం చేసినట్లు సమాచారం. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్‌ను సమర్థంగా రూపొందించడంతోపాటు సంప్రదాయ క్రికెట్ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరోవైపు తనపై విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. క్రికెట్‌ను కొత్త దేశాలకు, కొత్త తరాలకు చేరువ చేయడంతోపాటు ఆటగాళ్లు, అభిమానులు, వాణిజ్య భాగస్వాముల ప్రయోజనాలను పరిరక్షించడమే తన లక్ష్యమని వెల్లడించినట్లు సమాచారం.

48 బంతుల్లో 135 పరుగులు

ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వీరవిహారం!



న్యూ చండీగఢ్, నవంబర్ 16 (సమయం న్యూస్): రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. మధ్యప్రదేశ్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రజత్ పాటిదార్, అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే 8 ఫోర్లు, 13 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 281.25 విధ్వంసకర స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన పాటిదార్, కేవలం 41 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ క్లిష్ట సమయంలో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రజత్ పాటిదార్, అస్సాం బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మైదానం నలుమూలలా బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పాటిదార్ మెరుపు బ్యాటింగ్ కారణంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ సెంచరీతో రజత్ పాటిదార్ తన పాత రికార్డును తానే బద్దలు కొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా రజత్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. గతంలో 2021లో గోవాపై 96 పరుగులు, 2022లో రైల్వేస్‌పై 92 పరుగులు చేసి త్రుటిలో సెంచరీలను చేజార్చుకున్న పాటిదార్, ఇప్పుడు మూడంకెల స్కోరును దాటి ఆ లోటును భర్తీ చేసుకున్నాడు. కాగా, ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ వన్డే టోర్నమెంట్‌కు ఎంపికైనప్పటికీ, 50 ఓవర్ల క్రికెట్ ఆడేందుకు తన శరీరం పూర్తిగా సహకరించడం లేదని, అందుకే కేవలం టీ20 క్రికెట్‌పైనే దృష్టి పెడుతున్నానని స్పష్టం చేస్తూ పాటిదార్ ఆ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. తాజా తుఫాన్ ఇన్నింగ్స్‌తో టీ20 ఫార్మాట్‌లో తాను ఎంత ప్రమాదకరమైన ఆటగాడో పాటిదార్ మరోసారి నిరూపించుకున్నాడు.

విరాట్ కోహ్లీకి ఏమైంది?

- 11 ఏళ్లలో తొలిసారి వరుసగా మూడు సింగిల్ డిజిట్ స్కోర్లు!



న్యూఢిల్లీ/ఆక్లాండ్, నవంబర్ 16 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో ముగిసిన ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈ పర్యటనలో కోహ్లీ మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి 21.50 సగటుతో కేవలం 86 పరుగులు మాత్రమే సాధించాడు. అయినప్పటికీ, భారత జట్టు తరఫున ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా (టాప్ స్కోరర్) కోహ్లీనే నిలవడం గమనార్హం. సిరీస్ మొత్తంలో ఏ ఒక్క భారత బ్యాటర్ కూడా కనీసం 100 పరుగుల మార్కును చేరుకోలేకపోవడం టీమిండియా సమష్టి బ్యాటింగ్ వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. అయితే ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌లలో కోహ్లీ తన జోరును కొనసాగించలేకపోయాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో 7 పరుగులకే వెనుదిరిగాడు. మూడో వన్డే వర్షం కారణంగా రద్దు కాగా, మౌంట్ మౌంగనుయ్‌లో జరిగిన నాలుగో వన్డేలో మాట్ హెన్రీ బౌలింగ్‌లో నాలుగు బంతులు ఆడి డకౌట్ (0) అయ్యాడు. ఇక ఆదివారం జరిగిన చివరిదైన ఐదో వన్డేలోనూ మాథ్యూ ఫిషర్ బౌలింగ్‌లో కేవలం 5 పరుగులకే కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. తొలి మ్యాచ్‌లో చేసిన 74 పరుగులు మినహాయిస్తే, ఆ తర్వాతి మూడు ఇన్నింగ్స్‌లలో కోహ్లీ కేవలం 12 పరుగులు మాత్రమే సాధించాడు. ఒకే వన్డే సిరీస్‌లో వరుసగా మూడుసార్లు సింగిల్ డిజిట్ (7, 0, 5) స్కోర్లకు పరిమితం కావడం గత 11 ఏళ్లలో కోహ్లీకి ఇదే తొలిసారి. చివరిసారిగా 2014-15లో ఆస్ట్రేలియాలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో అతను ఇలా వరుసగా మూడుసార్లు సింగిల్ డిజిట్‌కు ఔటయ్యాడు. న్యూజిలాండ్‌పై వన్డేల్లో 2,000 పరుగుల మైలురాయికి 103 పరుగుల దూరంలో బరిలోకి దిగిన కోహ్లీ, ఆ రికార్డుకు 17 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా అత్యంత కీలకమైన ఈ దశలో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పేస్, బౌన్స్ పిచ్‌లపై తడబడటం టీమిండియా మేనేజ్‌మెంట్‌ను తీవ్రంగా కలవరపెడుతోంది.



ఫైనల్స్‌కు ఆండ్రీవా

యూఎస్ఏ: టెన్నిస్‌లో సీజన్ ఎండింగ్ టోర్నీ అయిన డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో రష్యా యువ సంచలనం మిరా ఆండ్రీవా జోరు కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో 19 ఏండ్ల ఆండ్రీవా.. 6-3, 6-4తో జెస్సికా పెగులా (అమెరికా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో ఆమె స్వితోలిన (ఉక్రెయిన్)తో తలపడనుంది. 2004లో రష్యాకే చెందిన మారియా షరపోవా (17 ఏండ్లకు) తర్వాత ఈ టోర్నీ ఫైనల్స్ చేరిన తొలి టీనేజర్‌గా ఆండ్రీవా రికార్డులకెక్కింది.



భయంతో నిద్రలేని రాత్రులు గడిపా

ఇంట్లో దెయ్యం ఉందేమోనని వణికిపోయా!


ఆసక్తి రేపుతున్న శ్రుతిహాసన్ వ్యాఖ్యలు

చెన్నై, నవంబర్ 16 (సమయం న్యూస్): తన ఇంట్లో దెయ్యం ఉందేమోనని భయపడిన సందర్భాలు ఉన్నాయని ప్రముఖ సినీనటి శ్రుతిహాసన్ వెల్లడించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. చెన్నైలోని తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన వింత అనుభవాలు తనను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు సమాచారం. ఎవరూ ముట్టుకోకుండానే బొమ్మ ఒకచోటు నుంచి మరోచోటుకు మారిపోతుండటంతో ఏం జరుగుతోందో అర్థంకాక వణికిపోయానని ఆమె వివరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తన ఇంట్లో మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి 'ఫియోనా' అని పేరు పెట్టుకున్నానని శ్రుతిహాసన్ తెలిపినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇంటికి వచ్చిన స్నేహితులు కూడా ఆ బొమ్మను సరదాగా పలకరించేవారని, మొదట్లో దానిని సాధారణ బొమ్మగానే భావించానని చెప్పారట. అయితే కొంతకాలానికి ఆ బొమ్మను ఒకచోట ఉంచితే మరోచోట కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యానని వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యంగా ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇలాంటి అనుభవాలు ఎదురవడంతో భయం మరింత పెరిగిందని చెప్పారట. ఇంట్లో ఏదో అదృశ్య శక్తి ఉన్నట్లు అనిపించేదని, ఆ భయాన్ని అధిగమించేందుకు హనుమాన్ చాలీసా వినడంతోపాటు చేతిలో ఉప్పు పట్టుకుని ప్రార్థనలు చేసేదాన్నని శ్రుతిహాసన్ వివరించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ బొమ్మ విషయంలో భయం తగ్గకపోవడంతో చివరకు దానిని ఇంటి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారట. బొమ్మను పూర్తిగా విడదీసి, భాగాలను బయటకు పంపించేసినట్లు తెలిపారట. అనంతరం మనశ్శాంతి కోసం ఇంట్లో పూజలు నిర్వహించుకున్నానని, ఆ తర్వాత ప్రశాంతంగా అనిపించిందని చెప్పినట్లు సమాచారం. తనకు ఎదురైన అనుభవం ఓ భయానక చిత్రంలోని సన్నివేశాన్ని తలపించిందని శ్రుతిహాసన్ వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బొమ్మ నిజంగానే దానంతట అదే కదిలిందనడానికి స్వతంత్ర ఆధారాలు లేవు. ఆమె వ్యక్తిగత అనుభవంగా ప్రచారంలో ఉన్న ఈ కథనం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పెళ్లి తర్వాతా తగ్గేదేలే..

వివాహం తర్వాత కూడా వైవిధ్యమైన పాత్రలపై దృష్టి

కెరీర్‌కు పెళ్లి అడ్డుకాదని చాటుతున్న 'మహానటి'



హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో పెళ్లి తర్వాత కథానాయికలకు అవకాశాలు తగ్గుతాయనే పాత అభిప్రాయానికి భిన్నంగా కీర్తి సురేష్ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. 2024 డిసెంబర్ 12న తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌ను వివాహం చేసుకున్న ఈ 'మహానటి' సినిమాలకు విరామం ఇవ్వకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. వివాహమైన కొద్దిరోజులకే వరుణ్ ధావన్ సరసన నటించిన 'బేబీ జాన్' చిత్రం విడుదల కావడం విశేషం. ఆ తర్వాత 'ఉప్పు కప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి చిత్రాలతో ప్రేక్షకులను పలకరించింది. కేవలం సంప్రదాయ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్న కథాంశాలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో కొత్త కోణాలను ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. కథానాయికగా నటించడంతోపాటు ప్రత్యేక గీతాల్లో కనిపించేందుకూ ఆసక్తి చూపుతోందన్న ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు అగ్ర కథానాయకుల చిత్రాల్లోనూ ఆమె పేరు వినిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న కొన్ని కొత్త చిత్రాలు, ప్రత్యేక గీతాలు, విడుదల తేదీలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. 'మహానటి'తో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కీర్తి సురేష్ తన కెరీర్‌లో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. పెళ్లి తర్వాత కూడా కథానాయికగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. మొత్తానికి వ్యక్తిగత జీవితాన్ని, సినీ ప్రయాణాన్ని సమన్వయం చేసుకుంటూ కీర్తి సురేష్ తనదైన శైలిలో దూసుకుపోతోంది.





జుట్టు కత్తిరించుకున్నానని చెప్పగానే అమ్మ ఫోన్ పెట్టేసింది!

ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన సాయిపల్లవి

హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్): సహజమైన అందం, అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కథానాయిక సాయిపల్లవి తాజాగా తన జుట్టు గురించి వెల్లడించిన ఆసక్తికర విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పాత్ర కోసం తన పొడవాటి ఉంగరాల జుట్టును కత్తిరించుకోవడంతో తల్లి తీవ్రంగా బాధపడ్డారని, ఆ విషయం చెప్పగానే ఫోన్ పెట్టేశారని సాయిపల్లవి వెల్లడించినట్లు ప్రచారం జరుగుతోంది. మేకప్‌కు దూరంగా ఉంటూ సహజమైన అందంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయిపల్లవి తన జుట్టు విషయంలో తీసుకున్న నిర్ణయం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'అమరన్' చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న 'ఓఎం' చిత్రంలో సాయిపల్లవి ఐపీఎస్ అధికారిణిగా కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె పాత్ర పేరు నిత్యారెడ్డి అని ప్రచారం జరుగుతోంది. నిజజీవిత ఐపీఎస్ అధికారిణి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడు ఈ పాత్రను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. పాత్రకు సహజత్వం తీసుకురావాలనే ఉద్దేశంతో సాయిపల్లవి పొడవాటి జుట్టును కత్తిరించుకునేందుకు సిద్ధమైనట్లు సినీ వర్గాల సమాచారం. అయితే ఈ నిర్ణయం ఆమె తల్లికి ఏమాత్రం నచ్చలేదట. చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టంగా పెంచుకున్న జుట్టును సినిమా కోసం కత్తిరించుకున్నట్లు సాయిపల్లవి ఫోన్‌లో చెప్పగానే తల్లి ఆశ్చర్యానికి గురై మాట్లాడకుండా ఫోన్ పెట్టేశారట. కొంతకాలం ఆ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారని సాయిపల్లవి చెప్పినట్లు కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా సినీ తారలు పాత్రలకు అనుగుణంగా విగ్గులు, ఇతర సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తుంటారు. కానీ పాత్రలో పూర్తిగా ఒదిగిపోయేందుకు సాయిపల్లవి తన రూపాన్ని మార్చుకోవడం విశేషంగా మారింది. కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇచ్చే నటిగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఆమె తాజా నిర్ణయం మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే చిత్రం, పాత్ర వివరాలతోపాటు జుట్టు కత్తిరించుకోవడంపై ఆమె చేసిన వ్యాఖ్యలకు అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.





హీరో తేజ సజ్జా నిశ్చితార్థం!

కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వేడుక

హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్): యువ కథానాయకుడు తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఆయన నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ప్రముఖ నటుడు చిరంజీవి, రవితేజ, రానా, శివాజీ, వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు వేడుకలో పాల్గొన్నారు. దర్శకులు కె.రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ, కార్తీక్ ఘట్టమనేని, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, సాహూ గారపాటి తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ వేదికగా తేజ సజ్జా వివాహం జరగనున్నట్లు సమాచారం. అనంతరం హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం వివాహ విందు ఏర్పాటు చేయనున్నారు. కాగా, తమది పెద్దలు కుదిర్చిన వివాహమని తేజ సజ్జా ఇటీవల వెల్లడించారు. వధువు కుటుంబానికి సినీ పరిశ్రమతో సంబంధం లేదని, వారు సాంకేతిక రంగానికి సంబంధించిన వ్యాపారంలో ఉన్నారని తెలిపారు. బాలనటుడిగా సినీ రంగంలోకి ప్రవేశించి, 'హనుమాన్', 'మిరాయ్' వంటి చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్'

ఆకట్టుకుంటున్న చిత్ర ట్రైలర్!

హైదరాబాద్, నవంబర్ 16 (సమయం న్యూస్): యువ కథానాయకుడు సుగి విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్'. పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో మాదం దయానంద్, కార్తీక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో జుప్సీ భద్ర కథానాయికగా పరిచయం కానున్నారు. నవంబర్ 27న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రేమ, పెళ్లి, కెరీర్‌తోపాటు స్వేచ్ఛగా జీవించాలనుకునే నేటితరం యువత ఆలోచనలను వినోదాత్మకంగా ఆవిష్కరించినట్లు దర్శకుడు తెలిపారు. యువత భావోద్వేగాలు, బంధాలు, వివాహంపై వారి అభిప్రాయాల చుట్టూ కథ సాగుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించామని, మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉందన్నారు. హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి విజయ్ సి.కుమార్ ఛాయాగ్రహణం అందించారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**